క్లుప్తంగా

2, 3 తేదీల్లో ఇంటర్ పరీక్షలు

జంగారెడ్డిగూడెం: ఇంటర్మీడియేట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఫిబ్రవరి 2, 3 తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌డీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బోడపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. పబ్లిక్ పరీక్షలలో భాగంగా ప్రథమ సంవత్సరం విద్యార్థులకు 2వ తేదీ నైతికత, మానవ విలువలు, 3న పర్యావరణ విద్యపై పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తప్పనిసరిగా పరీక్షలకు హాజరుకావాలని ఆయన కోరారు.

బస్టాండులోకి ప్రైవేటు వాహనాలను నిషేధించండి

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం బస్సు స్టాండ్‌లోకి ప్రైవేటు వాహనాలను రాకుండా అదుపు చేయాలి అని ప్రయాణికులు కోరుతున్నారు. బస్సులు చేరుకునే ప్లాట్‌ఫారం వద్దకు ప్రైవేటు వాహనాలు వస్తుండడంతో బస్సులు చేరుకోవడానికి ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్లాట్‌ఫారం వద్దకు రాకుండానే కొన్ని బస్సులు వెళ్లిపోతుండడంతో ఇబ్బందులకు గురవుతున్నామని ప్రయాణికులు వాపోయారు.

రామాలయానికి వెండి కిరీటాలు సమర్పించిన జేసీ

లింగపాలెం: లింగపాలెం మండలం ముడిచెర్ల రామాలయంలో విగ్రహాలకు జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్య వేణి వెండి కిరీటాలను మంగళవారం సమర్పించారు. జేసీ లావణ్య వేణిని కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. జేసీ సమర్పించిన కిరీటాలను సీతా రామ లక్ష్మణ ఆంజనేయస్వామి వార్లకు అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ లావణ్య వేణికి సర్పంచ్ రావి రమాదేవి కొండలు, ఆలయ కమిటీ సభ్యులు తాళ్లూరి సత్యనారాయణ, గ్రామ పెద్దలు దుశ్శాలువా కప్పి సత్కరించారు.

అంజన్నకు ప్రత్యేక పూజలు



ఎమ్మెల్యే ఆది నారాయణను సత్కరిస్తున్న ఈవో కొండలరావు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి మద్ది ఆంజనేయ స్వామిని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి వారికి తమలపాకులతో విశేష పూజలు నిర్వహించారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు మొక్కులను తీర్చుకున్నారు. ఆదాయం రూ.1,28,056 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. 800 మంది భక్తులు స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట ఎమ్మెల్యే జారా ఆదినారాయణ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఈవో కొండలరావు ఆయనను సత్కరించి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ధర్మకర్తలు మల్నీడి బాబి, కర్పూరం రవి, ఆలయ పర్యవేక్షకులు కురగంటి రంగారావు పాల్గొన్నారు.

పట్టిసం ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన



గోదావరిపై నడక రహదారి ఏర్పాటుకు స్థల పరిశీలనలో పాల్గొన్న అధికారులు, నేతలు

పోలవరం రూరల్: మహాశివరాత్రి ఉత్సవాలకు పట్టిసం శివక్షేత్రానికి వచ్చే భక్తులు కాలినడకన నది దాటి వెళ్లి వచ్చేందుకు వీలుగా ఏర్పాటు చేసే పంట్లు ప్లాట్‌ఫారం ప్రాంతాన్ని అధికారులు పరిశీలించారు. నాలుగేళ్లుగా కాలినడకన భక్తులు క్షేత్రానికి వెళ్లి వచ్చేందుకు వీలుగా పంట్లతో, ఇసుక బస్తాలతో పటిష్టంగా నడక దారి ఏర్పాటు చేస్తున్నారు. బోటు సూపరింటెండెంట్ చైతన్య కుమార్, తహసీల్దార్ బి.సుమతి, పోలవరం ఎస్సై ఎస్ఎస్‌పవన్‌కుమార్, ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి గోదావరి నదిలో లోతు, నీటి ప్రవాహం తదితర అంశాలు పరిశీలించారు. గతంలో ఏర్పాటుచేసిన ప్రదేశంలోనే నడక దారి ఏర్పాటు చేయాలని నిర్ధారించారు. ర్యాంపులు, ఇసుక తిన్నెలపై చేసే ఏర్పాట్లపై చర్చించారు.

మద్యం విక్రేత అరెస్ట్

జంగారెడ్డిగూడెం: అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు హెచ్‌సీ పీసీ హెచ్ శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. పట్టణంలోని డాంగే నగర్‌కు చెందిన ఎం.సీతా రామయ్యను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 4 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

5 లీటర్ల సారా స్వాధీనం

పోలవరం రూరల్: ఎల్ఎన్‌డీపేట గ్రామంలో సారా కలిగి ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎస్ఎస్‌పవన్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఒక వ్యక్తి 5 లీటర్ల సారాతో వెళుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

అర్హతే ప్రామాణికంగా పథకాల అమలు

- రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత
- ద్వారకాతిరుమలలో వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆత్మీయ సమావేశం



ద్వారకాతిరుమల కాపు కల్యాణ మండపంలో మాట్లాడుతున్న రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత

ద్వారకాతిరుమల: సిఫార్సులతో పనిలేకుండా, అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలను అన్ని వర్గాల ప్రజలకు అందిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత అన్నారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో మండల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. అందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి వనిత పరిచయ కార్యక్రమంతో పాటు, వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ తాను రాష్ట్రానికి హోం మంత్రి అయినప్పటికీ గోపాలపురం నియోజకవర్గానికి, మీకు ఆడపడుచునేనని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా, కరోనా మహమ్మారి వల్ల ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సంక్షేమ పథకాలను సీఎం జగనన్న ఎప్పుడూ వాయిదా వేయలేదన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపునకు ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త కృషి చేయాలని, కష్టపడే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. అందరం కలసికట్టుగా విజయానికి కృషి చేద్దామని అన్నారు. వచ్చేనెల 3న దెందులూరులో నిర్వహించనున్న సిద్ధం సభకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని సూచించారు.

అధికారులతో సమీక్ష : మంత్రి వనిత మండల అధికారులతో సమీక్షించారు. తహసీల్దార్ పి.సతీష్‌తో మాట్లాడి భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల పట్టాలు, డి పట్టాలు ఎంత మందికి ఇవ్వాలని ఆరా తీశారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. కుళాయి కనెక్షన్లపై ఆరా తీశారు. జలకళ పథకంలో బోర్లు సొంతంగా వేసుకున్న రైతులకు బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, వైస్ ఎంపీపీలు యలమర్తి దుర్గాదేవి, ఓగిరాల చంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, సర్పంచ్ కుంటం స్వర్ణలత, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, దాకారపు బంగారమ్మ, అంబటి గాంధి, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, అచ్యుత ఏసుబాబు, ఉక్కుర్తి వెంకట్రావు, రుద్ర శివాజీ, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, ఆచంట బన్ను, బొండాడ వెంకన్నబాబు, పోలిన నారాయణరావు, పరసా వీర్రాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ జేవీకే రెడ్డి, దాసరి ఏసురత్నం, చెలికాని బుల్లియ్య, మానుకొండ సుబ్బారావు, పానమాల ఉమామహేశ్వరరావు, దూలపల్లి ప్రసాద్, పోల్కంపల్లి అనీల్, రేగంటి వెంకటేశ్వరరావు, దాకారపు అగ్గియ్య, యాచమనేని నాగేశ్వరరావు, బాలం వెంకటేశ్వరరావు, ప్రత్తిపాటి యోహాను, గుమ్మడి శ్రీను, మానుకొండ కన్నయ్య, కేవీఆర్, మానుకొండ నాగేశ్వరరావు, పెండ్యాల విజయ్, నల్లంటి రామారావు, డాక్టర్ బాలు ప్రకాష్, చెరుకూరి ప్రసాదరావు, గుర్రాల లక్ష్మణ్, పాకలపాటి భద్రరావు, పల్లి ప్రసాద్, నల్లూరి వెంకన్నబాబు, నల్లూరి బాపనయ్య, మద్దిపాటి సోమేశ్వరరావు, అల్లాడ హరేరామకృష్ణ, పసుపులేటి ఏసుబాబు, దొప్పసాని రాంబాబు, భోగరాజు సాయికృష్ణ, ఘంటా శ్రీను తదితరులున్నారు.

హోంమంత్రి వనితకు చిన్నమిల్లి అభినందనలు

రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనితను వైఎస్సార్ సేవాదళ్ రీజనల్ కోఆర్డినేటర్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కాపు సంఘం అధ్యక్షులు చిన్నమిల్లి వెంకట్రాయుడు స్థానిక కాపు కల్యాణ మండపం వద్ద మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పూల బొకేను అందించి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైనందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాపు కల్యాణ మండపం ట్రస్ట్ సభ్యులు పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, మైగాపుల మోహన్, అంబటి గాంధీ, రుద్ర శివాజీ, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, ఉక్కుర్తి వెంకట్రావు, అచ్యుత ఏసుబాబు పాల్గొన్నారు.

సీఎం జగన్ సంక్షేమ పాలన దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



దొరమామిడిలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం



తెల్లంవారిగూడెంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి

బుట్టాయగూడెం: సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని తెల్లంవారిగూడెంలో సుమారు రూ. 40 లక్షల వ్యయంతో నిర్మించి సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. పార్టీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మితో కలిసి మంగళవారం ప్రారంభించారు. గ్రామంలో హై లెవెల్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దొరమామిడిలో సుమారు రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. దొరమామిడిలో ప్రయాణికుల కోసం రూ. 5 లక్షల వ్యయంతో నిర్మించిన బస్‌షెల్టర్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ రాబోయే వేసవి కాలంలో నియోజకవర్గంలోని గ్రామాల్లో మంచినీటి ఇబ్బందులు కలుగకుండా నియోజకవర్గ పరిధిలోని 7 మండలాల్లో 170 వాటర్ ట్యాంక్‌లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చెయ్యడంతోపాటు రూ. 50 కోట్ల నిధులు మంజూరు చేశారని చెప్పారు. పోలవరం నియోజకవర్గ అభివృద్ధిపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్‌లు తెల్లం రాముడు, తెల్లం వెంకటలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు ఆరేటి సత్యనారాయణ, పార్టీ నాయకులు తెల్లం దుర్గారావు, పాకిరం శ్రీను, సోయం వెంకటరామయ్య, చింతలపూడి వెంకట నారాయణ, కాలింగి వెంకటేశ్వరరావు, అట్లూరి రమేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తిని వదిలి రాజకీయాల్లోకి

బుట్టాయగూడెం: ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి మంగళవారం దొరమామిడిలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ ఆలయం, వినాయకుని గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాజ్యలక్ష్మి గ్రామంలోని ప్రతి షాపునకు వెళ్లి రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేసి గెలిపించి, దీవించాలంటూ ప్రచారం ప్రారంభించారు. ఆ గ్రామంలోనే రాజ్యలక్ష్మి సుదీర్ఘ కాలం ఉపాధ్యాయినిగా పనిచెయ్యడంతోపాటు పుట్టిన ప్రాంతం కావడంతో ప్రజలు ఆప్యాయంగా పలకరించారు. గ్రామంలో ఎంపీయూపీ పాఠశాల జిల్లా పరిషత్ పాఠశాలగా అప్‌గ్రేడ్ అయిన సందర్భంగా పాఠశాలను ఎమ్మెల్యే బాలరాజుతో కలిసి ప్రారంభించారు. రాజ్యలక్ష్మి పనిచేస్తున్న పాఠశాల కావడంతో పిల్లలు, ఉపాధ్యాయులు ఆప్యాయంగా ఆమెను పలకరించి ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజ్యలక్ష్మిని పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్తగా నియమించడంతో ఉపాధ్యాయ వృత్తికి ఆమె రాజీనామా చేశారు. ఉపాధ్యాయురాలిగా మంగళవారం చివరిరోజు కావడంతో పిల్లలతో కొంత సమయం గడిపారు. అనంతరం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులను ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. తన భర్త ఆరోగ్య రీత్యా, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయానికి కట్టుబడి తాను రాజకీయాల్లోకి వచ్చినట్లు చెప్పారు. పాఠశాలల్లో విద్యార్థులను తీర్చిదిద్దిన విధంగానే నియోజకవర్గంలోని గ్రామాలను కూడా తీర్చి దిద్దుతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్‌లు తెల్లం రాముడు, తెల్లం వెంకటలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు ఆరేటి సత్యనారాయణ, పార్టీ నాయకులు తెల్లం దుర్గారావు, పాకిరం శ్రీను, సోయం వెంకటరామయ్య, చింతలపూడి వెంకట నారాయణ, కాలింగి వెంకటేశ్వరరావు, అట్లూరి రమేష్, పాల్గొన్నారు.

పొగాకు తోట పరిశీలనలో క్షేత్ర మిత్ర బృందం పర్యటన



జంగారెడ్డిగూడెంలో పొగాకు తోటను పరిశీలిస్తున్న క్షేత్ర మిత్ర బృందం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం వర్జీనియా వేలం కేంద్రం 1, 2 పరిధిలో మంగళవారం వర్జీనియా పొగాకు క్షేత్ర మిత్ర బృందం పర్యటించింది. పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ఎం.ఆదిశేషయ్య ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం 1, 2 వేలం కేంద్రాల పరిధిలోని మార్కండేయపురం, ముప్పినవారిగూడెం, కోటనాగవరం, దొరమామిడి, అశ్వారావుపేట, జీలుగుమిల్లి, మక్కినవారిగూడెంలో పొగాకు బోర్డు అధికారులు, సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు, వివిధ కంపెనీ ప్రతినిధులు కలిసి క్షేత్రమిత్ర బృందంగా ఏర్పడి రైతులకు సూచనలు అందించారు. సీటీఆర్ఐ శాస్త్రవేత్త రమేష్ తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పొగాకు బోర్డు జంగారెడ్డిగూడెం 1వ వేలం కేంద్రం అధికారి బి.శ్రీహరి మాట్లాడుతూ తోటల్లో నల్లి కాడ తెగులు నివారణకు బిలెటైాక్స్ లేదా కోసైడ్ పిచికారీ చేయాలన్నారు. పొగాకు బోర్డు ఆర్ఎం ఎం.ఆదిశేషయ్య, పీఎస్ఎస్ కంపెనీ ప్రతినిధి నాగేంద్ర రైతులకు పలు సూచనలందించారు. ఈ కార్యక్రమంలో సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు, వేలం కేంద్రం అధికారులు, ఐటీసీ ప్రతినిధి ఎం.చారువాక, క్షేత్రాధికారి ఏకేదాస్, పొగాకు బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా నైపుణ్యంపై విద్యార్థులకు అవగాహన

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడు ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో 9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు వృత్తి విద్యా నైపుణ్యంపై ప్రిన్సిపాల్ వి. పెద్దిరాజు మంగళవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ఇండస్ట్రియల్ క్షేత్ర పర్యటన ఆవశ్యతను వివరించారు. టొబాకో రీసెర్చ్ కేంద్రం కూడా సందర్శించి అక్కడ పొగాకు పంటలను పరిశీలించారు. ఉపాధ్యాయులు లక్ష్మణ్, ప్రశాంత్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పులి సంచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బుట్టాయగూడెం: జిల్లాలోని పలు గ్రామాల్లో పులి హడలెత్తిస్తోంది. బుట్టాయగూడెం మండలం ఎర్రాయిగూడెం గ్రామ సమీపంలోని చెరువు వద్ద పులి పాదముద్రలను అటవీశాఖాధికారులు గుర్తించారు. మండలంలోని అటవీ ప్రాంతంలోని కోపల్లి అటవీ బీట్ పరిధిలో ఒక ఎద్దుపై పులి దాడి చేసి హతమార్చింది. తదుపరి రెండు రోజులు ముంజులూరు, వీరన్నపాలెం, రెడ్డికోపల్లి గ్రామాల్లోని ప్రజలు పులి గాండ్రింపులను విన్నామని అన్నారు. ఎర్రాయిగూడెం సమీపంలో పులిపాదముద్రల తర్వాత కొయ్యలగూడెం మండలంలోని పలు గ్రామాల్లో పులి పాదముద్రలను రైతులు గుర్తించారు. తదుపరి నల్లజర్ల అటవీ ప్రాంతంలోనూ పులిపాదముద్రలను పలువురు గుర్తించారు. ఫారెస్ట్ అధికారులు ఆయా ప్రాంతాల్లో పర్యటించిన అవి పులిపాదముద్రలేనని నిర్ధారించారు. బుట్టాయగూడెం మండలంలోని కేఆర్‌పురం, రాజానగరం, కామయ్యకుంట, ముంజులూరు, తదితర సచివాలయ పరిధిలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ అధికారులు ప్రజలకు సూచనలు ఇస్తున్నారు. రెవెన్యూ, మండల పరిషత్, ఫారెస్ట్ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. సచివాలయ సిబ్బంది కూడా గ్రామాల్లో పులి సంచారంపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. పులిని బంధించి క్షేమంగా అడవికి పంపించేందుకు ఫారెస్ట్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యం



ఆడమిల్లిలో రోగులకు మందులు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, వైద్యులు

కామవరపుకోట: మారుమూల గ్రామాల్లోని పేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. మండలంలో ఆడమిల్లిలో రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేస్తున్నారన్నారు. అనంతరం తాడిచెర్లలో గల రోమన్ క్యాథలిక్ మిషన్ చర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్‌బాబు, ఎంపీటీసీ సాయిబాబు, నాగమల్లేశ్వరరావు, మేడూరు రంగబాబు, చిక్కాళ్ళ శ్రీను, ఇమ్మడి రాంబాబు, మద్దిరామయ్య, మోహన్, జోజి పాల్గొన్నారు.

యువత పరిశ్రమలు స్థాపించాలి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువతకు పరిశ్రమల స్థాపన అవకాశాలు అనే అంశంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అర్థశాస్త్ర, కామర్స్ విభాగాల ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ డా. ఎస్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.ఎస్.ప్రసాద్‌బాబు మాట్లాడుతూ యువత విద్యతో పాటు అనేక రంగాల్లో ప్రావీణ్యం సంపాదించాలన్నారు. విద్యార్థి దశ నుంచి పారిశ్రామిక రంగంపై అవగాహన కలిగి పరిశ్రమలను స్థాపించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ నాగేంద్ర గోపాల్ మాట్లాడుతూ చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అందించే రుణాలు, ప్రోత్సాహకాలు, దరఖాస్తు విధానాన్ని వివరించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ ప్రకాష్ మాట్లాడుతూ పీఎంఈజీపీ పథకం ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమంలో అర్థశాస్త్ర విభాగ అధిపతి కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి.శ్రీనివాసరావు, సీహెచ్ రమాదేవి, అర్థశాస్త్ర విభాగం నుంచి వి.హనుమంతరావు పొలిటికల్ సైన్స్ విభాగం ఎమ్.శ్రీనివాసరావు, కామర్స్ విభాగం నుంచి కేవీవీ శిరీష, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

గాంధీజీకి ఘన నివాళి



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్‌ల నాయకులు

టి.నరసాపురం: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని మంగళవారం టి.నరసాపురంలో ఆర్యవైశ్య సంఘం వాసవి క్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రధాన రహదారి పక్కన ఉన్న గాంధీ విగ్రహానికి సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు మాదంశెట్టి సోమరాజు, అద్దంకి రవి, అద్దంకి రామకృష్ణ, ఎం.మల్లికార్జునరావు, నల్లూరి శ్రీనివాస్, పసుమర్తి రాము, మండం ఆదిత్య కుమార్, పరిమి నాగేశ్వరరావు, కొనకల్ల శ్రీనివాస్, అద్దంకి జగ్గారావు, వాసవి క్లబ్ నాయకుడు జూలూరి నగేష్ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఉప్పలమెట్ట వాసవీ కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. స్థానిక రాజీవ్‌నగర్ బైపాస్ రోడ్డులోని మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాముల విగ్రహాలకు క్లబ్ అధ్యక్షుడు గుళ్లపూడి మురళీకృష్ణ, కార్యదర్శి కొనకళ్ల శ్యామ్ సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి బీవీవీ సత్యనారాయణ, క్లబ్ పూర్వాధ్యక్షులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల అటవీ ప్రాంతంలో గల గ్రామాలైన రేపల్లె, రేగులపాడు గ్రామాల్లో దొరమామిడి పీహెచ్‌సీ వైద్యబృందం మంగళవారం వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. 107 మందికి వైద్య పరీక్షలు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎంకెఎస్ గణేష్, ఎమ్ఎల్‌హెచ్‌పి జి. సాయిప్రమోదిని, ఏఎన్ఎమ్ రాధ, హెల్త్ అసిస్టెంట్ కె. కన్నపరాజు, ఆశా, పి. సింగారమ్మ, పీటర్ అంబులెన్స్ ఈఎంటీ టి. చిన్నబాబు, ఎమ్ఎన్ఓ శ్రీను, వై. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మానవ తప్పిదాల వల్లే అధిక ప్రమాదాలు

జంగారెడ్డిగూడెం: మానవ తప్పిదాల వల్లే అధికంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని జంగారెడ్డిగూడెం పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.రాజేష్ అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీలో ఆర్టీసీ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు, కండక్టర్లకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఐ పి.రాజేష్ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు మద్యం సేవించి విధులకు హాజరైనా, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసినా చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. స్థానిక డిపో మేనేజర్ పి.పి.వి.గంగాధరరావు మాట్లాడుతూ ఈ సంవత్సరం భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 95 శాతం రోడ్డు ప్రమాదాలు డ్రైవర్ల తప్పిదాల వల్లనే జరుగుతున్నాయని అన్నారు. ప్రతీ డ్రైవర్‌కి డ్యూటీ తర్వాత విశ్రాంతి అవసరమని సూచించారు. కార్యక్రమం అనంతరం సీఐ రాజేష్‌ను డిపో మేనేజర్ గంగాధరరావు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిపో ఎ.ఎం.టి వరలక్ష్మి, మెకానికల్ ఫోర్మెన్ కేశవ కుమార్, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

జంగారెడ్డిగూడెం: ఈ నెల 31వ తేదీ బుధవారం జంగారెడ్డిగూడెం మున్సిపల్ 5వ సచివాలయం రామచంద్రాపురం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.భవానీప్రసాద్ తెలిపారు. స్థానిక రాజుల కాలనీలోని బాలికల హైస్కూల్ వద్ద ఉదయం 9 గంటల నుంచి 5 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైద్యులు పాల్గొంటారని తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలపై వినతిపత్రం

కొయ్యలగూడెం: రాష్ట్ర గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు ఎమ్మెల్యే తెల్లం బాలరాజును కలుసుకుని మంగళవారం సమర్పించారు. నియోజకవర్గ పరిధిలోని ఫీల్డ్ అసిస్టెంట్ల బృందం, యూనియన్ నాయకులు తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యేను అభ్యర్థించారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు అందజేయడంతోపాటు మరో ఎనిమిది డిమాండ్లను వినతిపత్రంలో పేర్కొన్నారు. సమస్యలను, ఉద్యోగుల కోర్కెలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని ఆయన హామీ ఇచ్చారు.

తాడువాయిలో 'పల్లెకు పోదాం'

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమాలను నిర్వహించారు. బీజేపీ శ్రేణులు వేగవరం, జొన్నవారిగూడెం, తాడువాయి, తదితర గ్రామాల్లో పర్యటించి కార్యకర్తలను కలుసుకున్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామానికి ఇద్దరు నూతన కార్యకర్తలను ఎంపిక చేసి వచ్చే నెల 3న శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ మూడవ సారి అధికారంలోకి రావాలనే లక్ష్యంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు.

ఈవీఎంలపై అవగాహన కార్యక్రమం

కొయ్యలగూడెం: ఈవీఎంలపై అవగాహన, శిక్షణ కార్యక్రమం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. తహసీల్దార్ పాసం నాగమణి ఆధ్వర్యం వహించారు. ఈవీఎంల పనితీరును ప్రయోగాత్మకంగా అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ అరుణ్, ఆర్ఐ మణి దివ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో వద్ద ధర్నా

జంగారెడ్డిగూడెం: విశాఖపట్నం డీపీటీవో నియంతృత్వ, అప్రజాస్వామిక పోకడలను విడనాడాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో వద్ద మంగళవారం కార్మికులు రెడ్ బ్యాడ్జిలు ధరించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ డీపీటీవో కక్ష సాధింపు చర్యలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 29, 30వ తేదీ రెండు రోజుల పాటు అన్ని డిపోలు, యూనిట్లలో ఎస్‌డబ్ల్యూఎఫ్ ధర్నాకు పిలుపునిచ్చిందన్నారు. దీనిలో భాగంగా మంగళవారం విధి నిర్వహణలో రెడ్ బ్యాడ్జిలు ధరించి డిపోలో ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిపో సెక్రటరీ డీవీఎస్ఎన్‌టీ రాజు, డిపో ప్రెసిడెంట్ ఎన్.నరేంద్రకుమార్, డిపో గ్యారేజీ సెక్రటరీ టి.ఇశ్రాయేలు పాల్గొన్నారు.